RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | మంగళవారం 21-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 292 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## సీజేపీ చలో పార్లమెంట్ ఉద్రిక్తం

- నిరసనకారులపై పోలీసుల బాష్ప వాయువు, లాఠీచార్జ్
- బారికేడ్ల దిగ్బంధంలో పార్లమెంట్ కాంప్లెక్స్
- ప్రభుత్వానికి నిరసనకారుల మూడు డిమాండ్లు
- నెరవేర్చకుంటే నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరిక



2లో

## శాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

- చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,జూలై: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో



## బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

- పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి
- ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం
- పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కెటిఆర్ ఆహ్వానం


హైదరాబాద్,జూలై: బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ

2లో

## సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ

2లో

- వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి




రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన, సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే



## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

### కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

- ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్

నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...



- ఉభయసభలు వాయిదా
- నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు
- తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా
- నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు

2లో

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య..

### పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర కలకలం

- పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలోనే ఘటన
- తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక నిర్ధారణ
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి మాణిక్ సాహా

త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి




2లో

## ఐపీఎస్ శిక్షణలో లైంగిక వేధింపుల కేసు..

### ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

- మహిళా అధికారిణిపై వేధింపుల కేసు..
- ఐపీఎస్ ట్రైనీ ఆత్మహత్యాయత్నం
- హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో విషం తాగి అపస్మారక స్థితిలోకి
- అంతకుముందు తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సోషల్ మీడియాలో పోస్ట్
- పోలీస్ కానిస్టేబుల్‌గా జీవితం ప్రారంభించి ఐపీఎస్‌కు ఎంపికైన ఉదయ్ కృష్ణారెడ్డి
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



2లో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ

ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సీజేపీ చలో పార్లమెంట్ ఉద్రిక్తం

న్యూఢిల్లీ, జూలై 20: సెంట్రల్ ఢిల్లీలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంట్ ర్యాలీలో పాల్గొన్న నిరసనకారులు పార్లమెంట్ చుట్టూ ఉన్న బారికేడ్లను దాటడానికి ప్రయత్నించడంతో భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడం, అల్లర్ల నిరోధక వాహనాలను రంగంలోకి దించడం వంటి చర్యలు చేపట్టాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున చేపట్టిన ఈ నిరసన ర్యాలీ పోలీసులు, ఆందోళనకారుల మధ్య పదేపదే ఘర్షణలకు దారితీసింది. ఇటీవలి కాలంలో దేశ రాజధానిలో ఇంత భారీ స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టడం ఇదే మొదటిసారి. పార్లమెంట్ వైపు తమ ర్యాలీని ప్రారంభించేందుకు నిరసనకారులు పోలీసు బారికేడ్లను ఛేదించుకుని జంతర్ మంతర్‌ను దాటేందుకు ప్రయత్నించడంతో తొలి ఘర్షణ చెలరేగింది. నిరసన తీవ్రతరం కావడంతో ఆందోళనకారులు పార్లమెంట్ సమీపంలోని అత్యంత పటిష్టమైన భద్రతగల ప్రాంతంలో ఏర్పాటు చేసిన పలు బారికేడ్లను ఛేదించుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో జరిగిన ఘర్షణలో నిరసనకారులు, పోలీసు సిబ్బంది గాయపడ్డారు. జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ పార్లమెంట్ మార్చ్‌కు సీజేపీ పిలుపునిచ్చింది.

**ప్రభుత్వానికి మూడు డిమాండ్లు**


సీజేపీ ప్రతినిధి బృందం సోవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలుసుకుని నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో జవాబుదారీని డిమాండు చేస్తూ ఒక పిటిషన్ని సమర్పించింది. సీజేపీ డిమాండ్లపై ప్రభుత్వ నాయకత్వంతో సంప్రదించడానికి తనకు కొంత సమయం కావాలని నడ్డా కోరినట్లు సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. విద్యా వేత్త, వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయడం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ఆత్మహత్య చేసుకున్న నీట్ ఆశావహులకు రూ. 1 కోటి చొప్పున నష్ట పరిహారం చెల్లించడం సీజేపీ ఇతర డిమాండ్లు.

**నిరసనను విరమించండి: ప్రభుత్వం**

కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ సీజేపీ చేస్తున్న నిరసనపై ప్రభుత్వం మొదటిసారి స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సీజేపీ నిరసనకారులు ఒక మొదటి ప్రతిపాదన చేశారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ధృవీకరించారు. ఈ ఉదయం మొదటిసారిగా ప్రభుత్వంతో చర్చలు జరపాలనే ప్రతిపాదన నిరసనకారుల నుంచి వచ్చింది. ఉదయం 11.50 గంటల నుంచి మా చర్చలు కొనసాగుతున్నాయి అని ఎక్స్ పోస్ట్‌లో నడ్డా పేర్కొన్నారు. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం భేటీ అయ్యారు. సీజేపీ చలో పార్లమెంట్ నేపథ్యంలో వీరిద్దరూ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

దేశరాజధాని ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను కొనసాగించనున్నట్లు ప్రకటించారు. యువజన నేతలను పార్లమెంట్‌లో ఎంపీలను కలవడానికి అనుమతించే వరకు లేదా ఎంపీలు తనను దవాఖానలో చూసేందుకు వచ్చేవరకూ, తన దీక్షను విరమించబోనని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు.

# శాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ. 1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ. 1,000 కోట్లు ఉంటుందని అంచనా.

సెక్షన్ 22ఏ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ 22ఏ(1)(బి) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు. స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు: అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య..

అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# ఐపీఎస్ శిక్షణలో లైంగిక వేధింపుల కేసు..

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఐపీఎస్ ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. తనతో పాటు శిక్షణ పొందుతున్న ఓ మహిళా అధికారిణిని లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై కేసు నమోదైన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. మోతీనగర్‌లోని తన బంధువుల నివాసంలో ఉదయ్ కృష్ణారెడ్డి విషపూరిత పదార్థం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బంధువులు వెంటనే అతడిని ఎస్ఆర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆరోపణలు అవాస్తవం అంటూ సోషల్ మీడియా పోస్ట్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి ముందు ఉదయ్ కృష్ణారెడ్డి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. తనపై వచ్చిన ఫిర్యాదులు, పుకార్లన్నీ నిరాధారమైనవని, వాటిలో ఎలాంటి నిజం లేదని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని, కచ్చితంగా న్యాయం గెలుస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రసారం చేయాలని మీడియాను కోరారు.

**బాధితురాలి ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు**

30 ఏళ్ల మహిళా ఐపీఎస్ ట్రైనీ అధికారిణి ఆదివారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జులై 10 మధ్య శిక్షణ సమయంలో అతను తనను లైంగికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. వాట్సాప్ ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, తోటి ట్రైనీల ముందు తన గురించి తప్పుడు ప్రచారం చేయడం, మరో ట్రైనీతో తనకు లైంగిక సంబంధం అంటగట్టడం వంటివి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఫోన్ లాక్కుని, పాస్‌వర్డ్ చెప్పాలంటూ బెదిరించి, వ్యక్తిగత సందేశాలను చూశాడని ఆరోపించారు. అంతటితో ఆగకుండా తనకు తెలియకుండా తన ప్రైవేట్ వీడియోను రికార్డ్ చేసి, బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశంతో దాన్ని తన భర్తకు పంపాడని ఆమె తన ఫిర్యాదులో వివరించారు.

**పోలీసుల కేసు నమోదు.. దర్యాప్తు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 74, 75, 77, 78, 79, 127(2), 115(2), 351(2) లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్లు 66ఇ, 67ఏ కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డి పోలీస్ అకాడమీ నుంచి వెళ్లిపోయి బంధువుల ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించారు. ప్రకాశం జిల్లా ఊళ్లపాలెంకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, 2013లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు.

# విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళు లర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి. సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు. మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్ఏఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

# బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు.

# మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ÷-రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేరు.



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్ గారిని,మేడ్చల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ అంజి రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**మేడ్చల్ 20.(నేటి ప్రస్థానం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుధాంష్ గారిని,మేడ్చల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజి రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హార్దిక శు భాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ నడికొప్పు నాగరాజు (చాపరాజు)ముదిరాజ్,298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ గర్శాల సురేందర్ ముదిరాజ్,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీ చీర్ల రమేష్ కురుమ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ,పాలకుర్తి రాఘవేందర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొక్క రఘుపతి రెడ్డి,చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్,సత్తి రెడ్డి,హనుమంత్ రెడ్డి,లవంగు రాకేష్ వంజరి,దండు శ్రీకాంత్ (చింటు),పెగుడ శ్యాంరావ్,కాలేరు శ్రీకాంత్ వంజరి,కనకాల ప్రశాంత్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు,నాయకులు,కార్యకర్తలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం


**20వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్**





**గుమ్మడిదల (జిన్నారం), జూలై 20 (నేటి ప్రస్థానం):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ 20వ వార్డులో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. రహదారులపై రాకపోకలకు ఆటంకం ఏర్పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు భద్రతా చర్యలను విస్మరించరాదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతంతో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఆది రామకృష్ణ, పూజారి రాజు, కృష్ణ, శాంత వర్మారెడ్డి, గణేష్, మల్లేష్, అరుణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి తపస్










**మేడ్చల్ 20.(నేటి ప్రస్థానం):** రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలు ముఖ్యంగా ఆరు డిఏల పెండింగ్, పెండింగ్ పిఆర్సి నీ వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా సిపిఎస్ ను రద్దు చేయాలని,హెల్త్ కార్డులను వెంటనే అమలులోకి తేవాలని ఇలా అనేక డిమాండ్లతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మూడంచెల నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది, మొదటి విడతలో భాగంగా మండల తహసిల్దార్ లకు మెమోరండం ఇవ్వడం, రెండవ విడతలో జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించడం, ఇప్పుడు మూడో విడతలో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు అందరూ కూడా పెద్ద ఎత్తున ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తూ ఆగస్టు 1న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయవలసిందిగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ ఉపాధ్యాయులను కోరారు,ఇందులో భాగంగా మేడ్చల్ మండల కేంద్రంలోని జరుగుతున్నటువంటి శిక్షణ కేంద్రంలో భోజన విరామ సమయంలో ధర్నా పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా మండల కేంద్రంలో మండల విద్యాధికారి శ్రీ శంకరయ్య గారితో ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మద్దతు సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ తో పాటు రాష్ట్ర బాధ్యులు విస్లావత్ గోపాల్, జిల్లా బాధ్యులు రాంబాబు, తపస్ మేడ్చల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ మహేందర్ మరియు తిరుపతిలు పాల్గొన్నారు.



## మేడ్చల్ యం ఆర్ ఓ ఆఫీస్ కార్యాలయంలో డిప్యూటీ తహాశీల్దార్ అనూష రెడ్డి గారి ఆధ్వర్యంలో SIR సమీక్ష సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మేడ్చల్. 20 ( నేటి ప్రస్థానం):** ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ యం ఆర్ ఓ ఆఫీస్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అనూష రెడ్డి గారి ఆధ్వర్యం లో SIR (Special Intensive Revision) కార్యక్రమంపై దీూాలు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని,అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా దీూాలు,పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేయడంతో పాటు,ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిం చాలని కోరారు.అనంతరం సమావేశంలో పాల్గొన్న నాయకులతో కలిసి SIR ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించి,అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ నడికొప్పు నాగరాజు (చాపరాజు)ముదిరాజ్,298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెగుడ శ్యాంరావ్, నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్,చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్,శ్రీరాం రెడ్డి,వరధా రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు,నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బోధనకు ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ

**అన్నారం జడ్‌పీహెచ్‌ఎస్‌లో మూడు రోజుల సమగ్ర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం**



**గుమ్మడిదల, జూలై 20 ( నేటి ప్రస్థానం )::** విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర (ఇంటిగ్రేటెడ్) ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం జడ్‌పీహెచ్‌ఎస్‌లో ప్రారంభమైంది. తొలి రోజు నిర్వహించిన ఫస్ట్ స్పెల్ శిక్షణలో మండలంలోని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బోధనా విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు. శిక్షణా కార్యక్రమానికి గుమ్మడిదల మండల విద్యాధికారి (ఎంఈఓ) పౌలీనా కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. వివిధ సబ్జెక్టులకు చెందిన రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) పాల్గొని నూతన విద్యా విధానాలు, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, సృజనాత్మక బోధనా పద్ధతులు, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా గణిత విభాగానికి టేకులపల్లి సునీత, ఝాన్సీ లక్ష్మి, నాగరాజు ఆర్పీలుగా, తెలుగు విభాగానికి సిద్ధయ్య, ఇంగ్లీష్ విభాగానికి ఝాన్సీ ఆర్పీగా శిక్షణ నిర్వహించారు. బోధనలో నాణ్యత పెంపు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, ఆధునిక విద్యా విధానాల సమర్థ అమలే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో బోధనా నైపుణ్యాల అభివృద్ధితో పాటు విద్యార్థుల అభ్యాసాన్ని మరింత ఫలవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పలు అంశాలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.

# మాజీ వైస్ చైర్మన్ శ్రీ చీర్ల రమేష్ గారి కృషి ఫలించింది

**హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి**



**మేడ్చల్: 20 ( నేటి ప్రస్థానం):** మేడ్చల్ పట్టణంలోని 297వ వార్డు పరిధిలో హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు పరిపాలనా ప్రక్రియ ముందుకు సాగింది. ఈ అభివృద్ధి పనికి మాజీ వైస్ చైర్మన్, మేడ్చల్ మున్సిపాలిటీ శ్రీ చీర్ల రమేష్ గారు చేసిన నిరంతర కృషి, సంబంధిత అధికారులతో పలుమార్లు జరిపిన విజ్ఞప్తులు, నిరంతర ఫాలోఅప్ ఫలితంగా ఈ పనికి ఆమోదం లభించింది. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సర్కిల్-60, మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం 15-07-2026 తేదీన లెటర్ ఆఫ్ అక్సెప్టెన్స్ (ూూూ) జారీ చేసింది.

**పని వివరాలు:**

**పని:** 297వ వార్డులో హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం.

**అంచనా వ్యయం:** రూ. 49.00 లక్షలు

**పని పూర్తి గడువు:** 3 నెలలు

ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ శ్రీ చీర్ల రమేష్ గారు మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్స రాలుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరిం చేందుకు తాను నిరంతరం అధికారులను కలిసి వినతులు సమర్పిస్తూ, సంబంధిత శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ కృషి చేశానని తెలిపారు. ఆ కృషికి ఫలితంగా ఈ పనికి అనుమతి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని, మేడ్చల్ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని శ్రీ చీర్ల రమేష్ గారు పేర్కొన్నారు.

# 108 వాహనంలో పాము కాటుకు మందు లేదు

మేడ్చల్ .20 (నేటి ప్రస్థానం) 108 వాహనంలో పాము కాటుకి మందు ఉందని సద్వినియోగం చేసుకోవాలని ఈ మధ్య సోషల్ మీడియాలో తరచుగా వైరల్ అవుతున్న ఈ వార్త అవస్తావమని ఇటువంటి తప్పుడు ప్రచారాలని నమ్మొద్దు అని మేడ్చల్ మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ మేనేజర్ దండవేణి తిరుపతి మరియు డిస్ట్రిక్ట్ ప్రొగ్రాం మేనేజర్ తోకల శ్రీకాంత్ తెలిపారు. పాము కాటుకి గురైనప్పుడు ఇంటి దగ్గరే ఇంజక్షన్ ఇవ్వడం అనేది చాలా ప్రమాదకరం అని పాము కాటు విరుగుడు మందు నిపుణులు అయిన వైద్యులు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలని వారు తెలిపారు. 108 వాహనం సేవలు ప్రమాదానికి గురైన వారికి ప్రథమ చికిత్స అందిస్తూ సమీపంలోని ఆసుపత్రికి తరలించడానికి మాత్రమే ఉపయోగిస్తారని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలని నమ్మొద్దని డిస్ట్రిక్ట్ మేనేజర్ దండవేణి తిరుపతి మరియు డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ తోకల శ్రీకాంత్ తెలిపారు.

# హైదరాబాద్‌లో టెక్కీ ఆత్మహత్య

**బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య**

**మద్యంలో విషం కలుపుకుని తాగినట్లు పోలీసుల అనుమానం**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రాజేంద్రనగర్ పోలీసులు**

హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సుధాకర్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యంలో విషం కలుపుకుని అతడు ప్రాణాలు తీసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.సుధాకర్ తన నివాసంలోని బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే వారు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు.

# తిరుమలకు భారీగా భక్తుల రాక...

## 31 కంపార్ట్‌మెంట్లు ఫుల్

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**

**వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి**

**శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం**

**ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం**

**నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు**



తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది.ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అంబేద్కర్ కాలనీలో శ్రీ పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఊపందింది

**స్లాబ్ పనులకు శుభారంభం.. సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



**గుమ్మడిదల, జూలై 20 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ పోచమ్మ దేవాలయం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణంలో కీలకమైన స్లాబ్ పనులకు సోమవారం శు భారంభం జరిగింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తమ సొంత నిధులతో చేపట్టిన ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా స్లాబ్ పనులను మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ కాలనీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే ఉద్దేశంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆలయాన్ని త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు.ఆలయ నిర్మాణం వేగంగా కొనసాగుతుండటంతో అంబేద్కర్ కాలనీ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. స్థానికుల సహకారంతో పనులు సజావుగా సాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తుడుం రవి, డప్పు శ్రీను, తుడుం రాజు, లింగం, రాజు, సుధాకర్, అర్జున్, కే. రమేష్, కాలనీవాసులు, సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గిన్నీస్ ఘనత సాధించిన కరాటే చిన్నారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందనలు

**క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచన**





**గుమ్మడిదల (పటాన్‌చెరు), జూలై 20 (నేటి ప్రస్థానం):** అంతర్జాతీయ స్థాయిలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించి ప్రతిభ చాటిన కరాటే విద్యార్థులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ఘనంగా అభినందించారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో చిన్నారులను సత్కరించి వారి విజయాన్ని ప్రశంసించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే అంతర్జాతీయ గుర్తింపు సాధించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి విజయాలు మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివారెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, క్రేజీ క్రూ కరాటే అకాడమీ నిర్వాహకుడు సంతోష్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మేడ్చల్‌లో వినూత్న నిరసన.. గుంతల్లో వరి నాట్లు వేసిన బీఆర్ఎస్ నాయకులు

**మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలుపుతూ మున్సిపల్ పరిపాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మేడ్చల్ 298 డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షాల కారణంగా రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో, ఆ నీటిలో వరి నాట్లు వేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాలు కురిసిన ప్రతిసారి హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డంతా గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాదచారులు సైతం ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు గుంతల్లో నిలిచిన నీటిని వరి సాగుకు అనుకూలమైన పొలాలుగా చిత్రీకరిస్తూ వరి నాట్లు వేసి నిరసన తెలపడం అక్కడి ప్రజల దృష్టిని ఆకర్షించింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ, మేడ్చల్ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేసిన తర్వాత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని హామీలు ఇచ్చారని, అయితే ఆ హామీలు అమలు కాలేదని ఆరోపించారు. విలీనంతో అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పినా, ప్రాథమిక మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి పదికి పైగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. అదే మార్గాన్ని ప్రభుత్వ అధికారులు కూడా ఉపయోగిస్తారని, అయినప్పటికీ రహదారి పరిస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. “ఇది సాధారణ వీధి కాదు. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు ఈ దారినే ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు” అని భాస్కర్ యాదవ్ విమర్శించారు. అంతేకాకుండా కాలనీలో తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌లో పిల్లలు పడి ప్రాణాలు కోల్పోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారా?” అని ప్రశ్నించారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.





నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం నశించాలి”, “రోడ్లు బాగు చేయాలి”, “మ్యాన్‌హోల్స్ మూసివేయాలి”, “మేడ్చల్‌కు న్యాయం చేయాలి” అంటూ నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. స్థానిక కాలనీవాసులు కూడా ఈ నిరసనకు మద్దతు తెలిపారు. వర్షం పడిన ప్రతిసారి రోడ్లు నీటితో నిండిపోతాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని, చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లడానికే భయపడుతున్నారని చెప్పారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, కాలనీ పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. ఈ వినూత్న నిరసనతో మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీలోని సమస్యలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ మూసివేత వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## తెలంగాణకు కొత్త మెట్రో ప్రాజెక్టులకు అనుమతులపై

# కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

### తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం

### రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి

### ఏపీలో ఎలాంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని స్పష్టీకరణ

తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని,



అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.



## గోదావరి పుష్కరఘాట్ ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ భాస్కర్

**లక్షెటిపేట, జూలై 20):** లక్షెటిపేట పట్టణంలోని గోదావరి వద్ద వచ్చే ఏడాది ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న పుష్కరాల ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ భాస్కర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అంతే కాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. సాధ్యమైనంత మేరకు పార్కింగ్ స్థలాన్ని గోదావరికి కాస్త దూరంలో ఉంచాలని తహసీల్దార్ దిలీప్ కుమార్ తో చర్చించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎలాంటి క్రైమ్ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. పుష్కరాల ఏర్పాట్లపై పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాష్,తహసీల్దార్ దిలీప్ కుమార్,సీ ఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పఠాన్ చెరువు, జూలై 20, :** కరాటే పోటీలలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, అకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్‌నగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

### ఇన్‌చార్జి మంత్రి డా.వివేక్ వెంకట్ స్వామి కి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**మెదక్ జిల్లా కౌడిపల్లి:** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని మహమ్మద్‌నగర్ సహకార సంఘం పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంకట్ వివేక్కు వినతిపత్రం అందజేశారు.సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రిని కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహమ్మద్‌నగర్ సొసైటీ పరిధిలోని 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని కోరారు.అదేవిధంగా ఈ వ్యవహారానికి సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్ అర్షద్ ఆత్మహత్య ఘటనపై కూడా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతుడు అర్షద్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా కౌడిపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్షద్ కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో మండలవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవరకొండలో తాగునీటి సమస్యల పరిష్కారానికి

# తక్షణ చర్యలు తీసుకోవాలి

**ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష సమావేశంలో మంత్రులకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**




**నల్లగొండ/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రాష్ట్ర మంత్రులను కోరారు. నల్లగొండలో నిర్వహించిన ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తాగునీరు--సాగునీటి నిర్వహణ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని నియోజకవర్గ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పెండ్లిపాకల 7 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద ఇటీవల మరమ్మతులు చేసిన 33/415 ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అలాగే బాట్లపల్లి పంప్‌హౌస్ వద్ద అదనపు మోటార్‌ను ఏర్పాటు చేయాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనలు అమలైతే నియోజకవర్గంలో తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా డిండి ప్రాజెక్టు నుంచి సాగునీరు ఇప్పటికే విడుదలైన నేపథ్యంలో, ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు ఉన్నందున వానాకాలం పంటలకు నిరంతరాయంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని



కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిఫార్సులను అనుసరించి పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు.



## 20వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్ పనుల పరిశీలన

### ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

### జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్... అది గీత రామకృష్ణ

**జిన్నారం, జూలై:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ రాళ్లకత్వ 20వ వార్డులో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్, రాళ్లకత్వ గ్రామ మున్సిపల్ కౌన్సిలర్ ఆది గీతా రామకృష్ణ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించిన వీరి ఇరువురు కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు ఆటంకం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఆది రామకృష్ణ, పూజారి రాజు, పొట్ట కృష్ణ, శాంత వర్మరెడ్డి, గణేష్, మల్లేష్, అరుణ్ తదితరులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి పంచాయతీకి కార్యదర్శిగా తొమ్మిదేళ్ల చైతన్య



**జీలుగుమిల్లి జూలై 20:** జీలుగుమిల్లి గ్రామ పంచాయతీలో గత కొంతకాలంగా ఇన్‌చార్జి పాలన కొనసాగుతున్న నేపథ్యంలో నూతన పంచాయతీ కార్యదర్శిగా తొమ్మిదేళ్ల చైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇప్పటివరకు బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపురం గ్రామ పంచాయతీలో గ్రేడ్--4 కార్యదర్శిగా విధులు నిర్వహించిన చైతన్య, పదోన్నతిపై గ్రేడ్--3 పంచాయతీ కార్యదర్శిగా జీలుగుమిల్లికి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీలుగుమిల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని, అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోనని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన పంచాయతీ సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొంటూ, గ్రామ పరిధిలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అధికారులు--ప్రజలు సమన్వయంతో పనిచేస్తే జీలుగుమిల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎస్సీఎస్సీ పరీక్షల్లో 575 మార్కులు సాధించిన ఎం. చేతన్‌కు షైనింగ్ స్టార్ అవార్డు.




**అమడగూరు,జూలై 20 :** శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలం,అమడగూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన భాస్కర్ కుమారుడు ఎం.చేతన్ 2026 మార్చిలో నిర్వహించిన ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్నాడు.ఈ అవార్డును సత్యసాయి జిల్లా గౌరవ కలెక్టర్ శ్రీ శ్యాం ప్రసాద్, ఐఏఎస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని విద్యార్థిని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ,విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. చేతన్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.ఎం. చేతన్ సాధించిన ఈ ఘనత అమడగూరు మండలానికే కాకుండా ఎస్సీ సమాజానికి గర్వకారణమని జిల్లా ఎస్సీ--ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చెరుకూరి గంగులయ్య, శోధనపల్లి రామాంజనేయులు, ఎం.ఎన్. మూర్తి, సింగ్, రోల్‌పల్లి బసెట్టి రవీంద్ర, తనకల్లు మండలానికి చెందిన జానకిరామ్, మద్దేపల్లి లక్ష్మీనారాయణ, కోసారుపల్లి మహేష్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ చేతన్‌కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక




## మేక వరప్రసాద్ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం

**మంచిర్యాల,జూలై:** దివంగత మేక వరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం సతీమణి శ్రీవాణి,కుమార్తె డాక్టర్ కుసుమశ్రీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా రక్తనిధి కేంద్రం సహకారంతో తేజ ల్యాబ్‌లో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయగా,అనంతరం సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్ మాట్లాడుతూ,మేక వరప్రసాద్ సేవా స్ఫూర్తిని ఆయన కుటుంబ సభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు. రక్తదాతలు,నిర్వాహకులకు రెడ్ క్రాస్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వి. మధుసూదన్ రెడ్డి,కాసర్ల శ్రీనివాస్,లయన్స్ క్లబ్ సభ్యులు,డాక్టర్ బి.ప్రేమ్ సాయి,రక్తనిధి కేంద్రం,తేజ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య**





**ఖమ్మం:** హైదరాబాదులో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కేకే కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య కమిటీ సభ్యులు అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ రాములు నాయక్ లను కలిసి తెలంగాణ ఉద్యమకారుల కొరకు పలు సలహాలు సూచనలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం 25 వేల పెన్షన్ ఉచిత రైల్వే బస్సు పాసులు ఇప్పించాలని హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలని ఉద్యమకారులకు ప్రత్యేకంగా హాస్పటల్ నిర్మించాలని కమిటీకి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కల సహకారం మాత్రమే అయినదని ఇంకా తెలంగాణలో పాలనలో ఆంధ్రుల పెత్తనం కొనసాగుతున్నదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అంగిడి బిక్షం అనంతుల మధు తునికిపాటి చారీ రాజేష్ నాయక్ కుక్కల సత్యం మీగడ రామారావు ఉల్లంగి పద్మ కలకోట అరుణ మంగీలాల్ నాయక్ రామ్మూర్తి నాయకుడు తుడుం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: పివైఎల్.

**ఆలేరు జూలై:** నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ డిమాండ్ చేశారు. అలాగే సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు మేరకు ఢిల్లీలో పార్లమెంట్‌కు వెళ్తున్న యువకులపై లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు.ఆలేరు పట్టణంలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో పివైఎల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మారుజొడు సిద్ధేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బేజాడి కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌తో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన చేస్తున్న వారిపై అణచివేత చర్యలు సరికావని అన్నారు. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలను నిలిపివేసి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ నాగరాజు, చికిలం వెంకటేష్, చిరబోయిన బాలకృష్ణ, ఎలగందుల సిద్ధులు, దడిగే కృష్ణ, కుండే బీరయ్య తదితరులు పాల్గొన్నారు.





# కోర్టు ధిక్కరణ అలవాటైంది

### ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దన్నా పదేపదే ఉల్లంఘనలు

### అహంకారపూరిత ధోరణి సరికాదు.. ఇలాంటి ప్రవర్తనను సహించం

### చట్టాన్ని మించి వ్యవహరించే అధికారం మీకు లేదు

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంటలోని ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోరాదని ఆదేశాలున్నా.. పదేపదే ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ ఆయనకు అలవాటుగా మారిందని, ఇలాంటి ప్రవర్తనను సహించేది లేదని తేల్చిచెప్పింది. ఇంత అహంకారపూరిత ధోరణి సరికాదని, ఏ పనైనా చట్టానికి లోబడే చేయాలని స్పష్టం చేసింది. ఐపీఎస్‌కు కూడా చెప్పాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఒక కేసులో మూడు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయంటే ఆయనకు కోర్టులపై ఉన్న గౌరవం ఏంటో తెలుస్తోందని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం అధికారులు ఉత్సాహంగా పనిచేయవచ్చని.. అయితే ప్రతి చర్య చట్ట పరిధిలోనే ఉండాలని పేర్కొంది. చట్టాన్ని అతిక్రమించి ప్రైవేట్ ఆస్తిలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదంది. ఏవీ రంగనాథ్ చట్టానికి అతీతులు కారని.. తమను తాము 'సూపర్ కాప్స్'గా భావించుకోవద్దని సూచించింది. చట్టాన్ని మించి వ్యవహరించే అధికారం ఆయనకు లేదని తేల్చిచెప్పింది. ఈ కేసులో బాధితులు పిటిషనర్ కాదని, కోర్టేనని ఘాటు వ్యాఖ్య చేసింది. కోర్టు చెప్పిన తర్వాత కూడా నేను అనుకున్నదే చేస్తా అనే లెక్కలేనితనంగా వ్యవహరిస్తే.. న్యాయస్థానాలు చూస్తూ కూర్చోవని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. పిటిషనర్‌పై ఎఫ్ఐఆర్‌కు సంబంధించి పూర్తి వివరాలతో మంగళవారం అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. రంగనాథ్ హాజరుకు పోలీసులను ఆదేశిస్తాం..: గతంలో ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలు, హైడ్రా తరఫున కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ అధికారులు ప్రైవేట్ భూమిలోకి ప్రవేశించి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నరసయ్య మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.హరీశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ..లోతుకుంట గ్రామంలోని 40 ఎకరాల భూమిపై కోర్టు ఇప్పటికే తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. గతంలో దాఖలైన ధిక్కార కేసులకు సంబంధించి జూన్ 10న ఇకపై హైడ్రా అధికారులు పిటిషనర్ ప్రైవేట్ భూమిలోకి అడుగుపెట్టవద్దని హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. కానీ జూలై 18న సుమారు 200 మంది సిబ్బంది, 50కి పైగా వాహనాలు, జేసీబీలు, బుల్డోజర్లతో హైడ్రా అధికారులు భూమిలోకి ప్రవేశించి ప్రహరీ, టిన్ షెడ్లు, సీసీ కెమెరాలు, గేట్లు, విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారని, స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. పిటిషనర్‌ను, అతని న్యాయవాదిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అక్రమంగా నిర్బంధించారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రంగనాథ్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌ను కోర్టు ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశిస్తామని అన్నారు. సాయంత్రం 6:30 గంటలకు హాజరవుతానని హైడ్రా కమిషనర్ చెప్పడంతో విచారణను వాయిదా వేశారు.

**ఉద్దేశపూర్వకంగా ధిక్కరణ**

సాయంత్రం ఏవీ రంగనాథ్ కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద హడావుడి నెలకొంది. ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్, స్పెషల్ జీపీలు, జీపీలు అంతా విచారణకు హాజరయ్యారు. హైడ్రా తరఫున ఏజీ వాదనలు వినిపిస్తూ.. జీఎల్ఆర్(కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని భూమి) సర్వే నంబర్ 243లో 119 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాని పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై సర్వే చేయడానికి, విభజన చేపట్టడానికి కొంత గడువివ్వాలని కోరారు.

# రాయలసీమలో జలకళ





**పుట్టపర్తి:** రాయలసీమను పారిశ్రామిక హబ్ గా, హార్టీకల్చర్ హబ్ గా సీఎం చంద్రబాబునాయుడు తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో వచ్చి సినిమా సెట్టింగ్ ల వేసి, కొబ్బరికాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, అయిదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. పుట్టపర్తిలో బుక్కపట్నం చెరువును ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, ఇతర కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచమంతా ఎల్ నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా తీర్చిదిద్దుతున్నారన్నారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తిరుపతిలో రాయల్ ఇన్ ఫీల్డ్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. కర్నూలును డ్రోన్ హబ్ అభివృద్ధి చేస్తూనే, జొన్నగిరి స్వర్ణగిరిగా మార్చుతున్నారన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ తో దాల్మియా సిమ్మెంట్ పరిశ్రమను విస్తరిస్తున్నారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటికే కియా కార్ల పరిశ్రమను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను నెలకొల్పారన్నారు. రాయలసీమ ప్రాంతానికి మొట్టమొదటిసారిగా అన్న ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమ లోని చివరి ఎకరాకు కూడా సాగునీరందుతుందని మంత్రి సవిత తెలిపారు. సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాయలసీమ ప్రాంత ముద్దు బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. బుక్కపట్నం చెరువులో బోటులో మంత్రి సవిత ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, కూటమి నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కీర్తిశేషులు గంగిశెట్టి కళావతి--రామచంద్రం జ్ఞాపకార్థం మెగా ఉచిత వైద్య శిబిరం





**ఆలేరు, జూలై 20 :** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని గడి ఆవరణలో కీర్తిశేషులు గంగిశెట్టి కళావతి--రామచంద్రం జ్ఞాపకార్థం మెగా ఉచితవైద్యశిబిరాన్ని ఘనంగానిర్వహించారు. మెడి సిటీ హాస్పిటల్, ఘనపూర్--మేడ్చల్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని గంగిశెట్టి వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించారు. తల్లిదండ్రులు కీర్తిశేషులు గంగిశెట్టి కళావతి--రామచం( దం స్మారకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం తమ కుటుంబానికి గౌరవకరమైన విషయమని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. శిబిరంలో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కంటి పరీక్షలు, చెవి--ముక్కు--గొంతు సంబంధిత సమస్యలు, వరిబీజం (హెర్నియా), గడ్డలు, థైరాయిడ్ వ్యాధులు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు తదితర అనారోగ్యాలపై నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. పరీక్షల్లో అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సపై కూడా వైద్యులు సూచనలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. గ్రామ ప్రజలంతా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాస్, ప్రొద్దుటూరి రమేష్, ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి, బెదరబోయిన వెంకటేష్, రాజబోయిన కొండల్, తేరాల నర్సింహులు తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# టయోటా సరికొత్త ఈవీ

## ప్రారంభ ధర రూ.23.60 లక్షలు..

న్యూఢిల్లీ, మే 30: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఈవీని తీసుకొచ్చింది. టయోటా ఎబెల్లా పేరుతో విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.23.60 లక్షలుగా నిర్ణయించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 541 కిలోమీటర్లు ప్రయాణించనుండగా... 49 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన కారు 344 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 10.1 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లేతోపాటు 10.25 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, ఫిక్స్‌డ్ గ్లాస్ రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే/ఆండ్రాయిడ్ ఆటో, ఎయిర్ ప్యూరిఫైర్, ఆటో ఏసీ, భద్రత ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, అన్ని టైర్లు డిస్క్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

# టీవీఎస్ సప్లై చైన్ ఫలితాలు అదుర్స్!



ప్రయివేట్ రంగ సంస్థ టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి--మార్చి(క్యూ4)లో నష్టాలనువీడి రూ. 18 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2024--25) ఇదే కాలంలో రూ. 4 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 21 శాతం ఎగసి రూ. 3,032 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 2,499 కోట్ల టర్నోవర్ అందుకుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 117 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024--25లో రూ. 10 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,996 కోట్ల నుంచి రూ. 11,003 కోట్లకు బలపడింది.

# వాహన లీజింగ్‌లోకి ఇసుజు మోటర్స్!



వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇసుజు మోటర్స్ ఇండియా తమ డీ--మ్యాక్స్ ఎస్--క్యాబ్‌కి సంబంధించి దేశీయంగా లీజింగ్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో నాలుగేళ్ల ఫిక్స్‌డ్ కాలవ్యవధికి, నెలవారీ అద్దె రూ. 38,999 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. సంప్రదాయ ఫైనాన్స్ మోడల్‌తో పోలిస్తే కస్టమర్లకు రూ. 1.81 లక్షల మేర ఆదా అవుతుందని వివరించింది. ఫ్లీట్ ఆపరేటర్లతో పాటు వివిధ వ్యాపార వర్గాల కోసం ఈ సొల్యూషన్‌ని రూపొందించినట్లు కంపెనీ ఎండీ రాజేష్ మిట్టల్ తెలిపారు. ఇసుజు డీ-మ్యాక్స్ ఎస్-క్యాబ్ 2.5-లీటర్ VGT ఇంటర్‌కూల్డ్ డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ పొందుతుంది. ఇందులో పెద్ద కార్గో బెడ్‌తో పాటు హెవీ-డ్యూటీ సస్పెన్షన్ సెటప్ కూడా ఉంది, ఇది అధిక డిమాండ్ ఉన్న వాణిజ్య అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. క్యాబిన్ లోపల, డి-మాక్స్ ఎస్-క్యాబ్ ఆరు విధాలుగా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు, ఎయిర్ కండిషనింగ్, అనేక స్టోరేజ్ స్థలాలు, మల్టీ-ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వంటి ఆచరణాత్మక ఫీచర్లు ఉంటాయి.

# పత్తి దిగుమతులపై సుంకం మినహాయింపు



న్యూఢిల్లీ: పత్తి దిగుమతులపై సుంకం మినహాయింపును కేంద్ర ప్రభుత్వం ఐదు నెలలు అవకాశం కల్పించింది. దీంతో ఈ ఏడాది అక్టోబర్ 30 వరకు పత్తి దిగుమతులపై ఎలాంటి సుంకం వసూలు చేయబోరు. ఇందుకు సంబంధించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. జూన్ 1 నుంచి అమలులోకి రానున్న ఈ నిబంధన ఏప్రిల్ 30 వరకు పత్తి దిగుమతులపై ఎలాంటి దిగుమతి సుంకాన్ని మినహాయింపునిచ్చారు. ఈ నిర్ణయంతో దేశీయ టెక్స్‌టైల్ రంగం ఎదుర్కొంటున్న పత్తి మరింత సులువుగా లభించనున్నదని పేర్కొన్నది. తాత్కాలిక పన్ను మినహాయింపుతో వస్త్ర, దుస్తుల రంగాల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, దేశీయ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తయారీదారులు, వినియోగదారులకు నిర్దిష్ఠ ఉపశమనాన్ని కల్పించడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ఒక ప్రకటనలో ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ కీలక నిర్ణయం దేశీయ టెక్స్‌టైల్ రంగానికి ఊతమిచ్చినట్టు కానున్నదని పేర్కొంది.

# పండుగలా దిగివచ్చిన పసిడి, వెండి..



దేశంలో గత వారం రోజులుగా బంగారం, వెండి ధరల్లో గణనీయమైన హెచ్చుతగ్గులు కనిపించాయి. అయితే వారం మొత్తంలో పెరుగుదల కంటే తగ్గుదలే ఎక్కువగా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మే 25 నుంచి మే 31 మధ్య పసిడి, వెండి ధరలు వరుస తగ్గుదలతో కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. మే 25తో పోలిస్తే మే 31 నాటికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,59,380 నుంచి రూ.1,57,040కు చేరి రూ.2,340 తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,46,100 నుంచి రూ.1,43,950కు తగ్గి రూ.2,150 మేర దిగివచ్చింది.


**వెండిలోనూ తగ్గుదల**

వెండి ధరలు కూడా వారాంతానికి బలహీనతను చూపించాయి. వెండి ధరలు కేజీకి మే 25, 26 తేదీల్లో రూ.2.95 లక్షల వద్ద స్థిరంగా ఉండగా, మే 27న రూ.5,000 తగ్గి రూ.2.90 లక్షలకు చేరాయి. మే 28న మరో రూ.5,000 తగ్గి రూ.2.85 లక్షలకు పడిపోయినా, మే 29న తిరిగి రూ.5,000 పెరిగి రూ.2.90 లక్షలకు చేరాయి. మే 30, 31 తేదీల్లో అదే స్థాయిలో కొనసాగాయి. మొత్తంగా వారాంతానికి వెండి కేజీకి రూ.5,000 తగ్గిందన్న మాట. అంతర్జాతీయ మార్కెట్లలో పారిశ్రామిక డిమాండ్ అంచనాలు, డాలర్ బలపడటం, పెట్టుబడిదారుల లాభాల స్వీకరణ ప్రభావంతో కిలో వెండి ధరల్లో తగ్గుదల నమోదైంది. దేశీయ బులియన్ మార్కెట్లలో కొనుగోళ్లు మందగించడం కూడా వెండి ధరలపై ప్రభావం చూపింది.

**బంగారం ధరల తగ్గుదలకు ప్రధాన కారణాలివే..**

ఈ వారం బంగారం ధరలు తగ్గడానికి అంతర్జాతీయ పరిణామాలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అమెరికా ఆర్థిక గణాంకాలు అంచనాల కంటే మెరుగ్గా రావడం, డాలర్ సూచీ బలపడటం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై కఠిన వైఖరి కొనసాగవచ్చన్న అంచనాలు బంగారంపై ఒత్తిడిని పెంచాయి. మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతలపై కొంత ఉపశమనం కనిపించడంతో సేఫ్‌హేవన్ ఆస్తిగా బంగారంపై డిమాండ్ తగ్గింది. దీంతో అంతర్జాతీయ బులియన్ ధరలు సరిదిద్దుకునే దిశగా కదిలాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లలోనూ ప్రతిబింబించింది.

# ఎల్ఐసీ ఇక రియల్టీపై ఫోకస్




న్యూఢిల్లీ: రియల్టీ ఆస్తుల నుంచి మెరుగైన రిటర్నులను సాధించాలని ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ చూస్తోంది. ఇందుకుగాను విడిగా అనుబంధ సంస్థ ఏర్పాటు అవకాశాలను అన్వేషిస్తోంది. భారీగా ఉన్న ఆస్తులను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా తాజా ప్రణాళికలకు తెరతీయనుంది. కంపెనీ ఆస్తుల కనీస విలువ రూ. 60,000 కోట్లుగా అంచనా వేసింది. కార్యకలాపాల నిర్వహణలో భాగంగా గత 7 దశాబ్దాలుగా రియల్టీ ఆస్తులను సమకూర్చుకుంటున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామి పేర్కొన్నారు. వెల్లడించారు. సొంత వినియోగంతోపాటు రిటర్నులకు వీలున్న పెట్టుబడి వ్యూహాలతోనూ ఆస్తులను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల కంపెనీ మొత్తం రియల్టీ పోర్ట్‌ఫోలియోపై పూర్తిస్థాయిలో సమీక్ష చేపట్టినట్లు తెలియజేశారు. తద్వారా కంపెనీకి లభిస్తున్న రిటర్నులు, ఆర్జన(ఈల్డ్స్)ను సమీక్షించడం తోపాటు.. మరింత మెరుగైన రిటర్నులకున్న అవకాశాలను అన్వేషించనున్నట్లు వివరించారు. అటు పాలసీదారుల రిటర్నులను పెంచడంతోపాటు.. ఇటు సంస్థ లాభదాయకతను మెరుగుపరిచే లక్ష్యం పూర్తిస్థాయిలో విశ్లేషిస్తున్నట్లు పేర్కొన్నారు.

# చేతులు కలిపిన హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్, జపాన్ బ్యాంకు




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మధ్యాదాయ, అందుబాటు ధరల గృహ సముదాయ ప్రాజెక్టులలో ఇన్వెస్ట్ చేసేందుకు తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్‌తో డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ జపాన్(డీబీజే) చేతులు కలిపింది. ఇందుకు అనుగుణంగా రియల్టీ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నాయి. మొత్తం బిలియన్ డాలర్ల(సుమారు రూ. 9,500 కోట్లు) మూలధన లక్ష్యంతో ఫండ్‌కు తెరతీయనున్నాయి. దీంతో డీబీజే తొలిసారి దేశీయంగా రియల్టీ రంగంలో పెట్టుబడులు చేపట్టనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ పేర్కొంది. అయితే పెట్టుబడి వివరాలు వెల్లడించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ డెవలప్‌మెంట్ రియల్టీ చౌక, మధ్యాదాయ(హెచ్--డీఆర్ఈఏఎం(డ్రీమ్) ఫండ్ పేరుతో ఏర్పాటు చేయనున్న నిధిని హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ అడ్వయిజర్స్ నిర్వహించనున్నట్లు తెలియజేసింది. 50 కోట్ల డాలర్ల కార్పస్ లక్ష్యానికి మరో 50 కోట్ల డాలర్లు గ్రీన్‌షూ ఆప్షన్‌తో ఫండ్‌ను నెలకొల్పనున్నట్లు తెలియజేసింది. 35 కోట్ల డాలర్లమేర పెట్టుబడులకు ప్రస్తుత ఇన్వెస్టర్లు కట్టుబాటు చూపనున్నట్లు వివరించింది. హెచ్‌డ్రీమ్ ఫండ్ హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్‌లో యాంకర్ ఇన్వెస్టర్‌గా ఐఎఫ్‌సీ 15 కోట్ల డాలర్ల పెట్టుబడులకు గతేడాది ఆగస్ట్‌లో కట్టుబాటును ప్రదర్శించినట్లు ప్రస్తావించింది.



# స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఢమాల్!

**పెరిగిన ధరలతో 30 శాతం వరకు పడిపోయే అవకాశం**

న్యూఢిల్లీ, : దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలకు ధరల పెంపు సెగ గట్టిగానే తాకనున్నది. రూపాయి పతనంతో మొబైల్ తయారీ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలు పెంచిన సంస్థలకు అమ్మకాల రూపంలో షాక్ తగలబోతున్నది. వచ్చే పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 30 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉన్నదని నివేదిక వెల్లడించింది. జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ధరలు మరోసారి పెరిగితే వార్షికంగా స్మార్ట్‌ఫోన్ సేల్స్ భారీగా పడిపోనున్నాయని త్రైకిన్ టెక్నాలజీ, టెకెర్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల మంది యాక్టివ్ మొబైల్ కొనుగోలుదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 48 మంది వచ్చే ఆరు నెలల్లో ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేసుకుంటున్నట్టు చెప్పారు. కానీ, ఆరు శాతం మంది తమ వద్ద ఉన్న ఫోన్‌ను ఎక్స్చేంజ్ ఇచ్చి ఇతర స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు భవిష్యత్తులోనూ కొనసాగితే వచ్చే ఆరు నెలల్లో స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ 11-12 కోట్లకు పడిపోనున్నట్టు తెలిపింది. రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సరాసరిగా 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగాయి. ధరల పెరుగుదలే అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని టెకెర్ ఫౌండర్ ఫైజల్ కవూసా తెలిపారు. గడిచిన ఏడాదికాలంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఐదు శాతం పడిపోయింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎగుమతులపై పన్ను తగ్గింపు



న్యూఢిల్లీ: ఇంధన ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గెయిన్స్ పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల మార్పులు, ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో తాజా సవరణలు అమల్లోకి తీసుకొచ్చినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తాజా నిర్ణయం ప్రకారం పెట్రోల్‌పై విండ్‌ఫాల్ గెయిన్స్ పన్నును లీటరుకు రూ.3 నుంచి రూ.1.50కు తగ్గించారు. డీజిల్‌పై ఈ పన్నును లీటరుకు రూ.16.50 నుంచి రూ.13.50కు సవరించారు. అలాగే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)పై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.16 నుంచి రూ.9.50కు తగ్గించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

**దేశీయ వినియోగదారులపై ప్రభావం లేదు**

దేశీయ మార్కెట్‌లో వినియోగానికి విడుదల చేసే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో దేశీయ వినియోగదారులపై ఈ నిర్ణయం ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం లేదని భావిస్తున్నారు. ముడి చమురు, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌ల సగటు అంతర్జాతీయ ధరలను ఆధారంగా చేసుకుని విండ్‌ఫాల్ పన్ను రేట్లను నిర్ణయిస్తారు. ఈ రేట్లను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించి సవరిస్తుంటారు. చివరిసారిగా 2026 మే 16న రేట్లలో మార్పులు అమలులోకి వచ్చాయి.

**ముడి చమురు ధరలపై భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం**

అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్న తర్వాత ప్రపంచ ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలు, సరఫరా అంతరాయాల భయాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతున్నాయి. దీంతో ముడి చమురు ధరల్లో అస్థిరత కొనసాగుతోంది.

అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు దేశీయ ధరల కంటే అధికంగా ఉన్న సమయంలో ఎగుమతిదారులు పొందే అదనపు లాభాలను నియంత్రించేందుకు విండ్‌ఫాల్ ట్యాక్స్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. మార్కెట్‌లో అసాధారణ పరిస్థితుల కారణంగా ఏర్పడే అనూహ్య లాభాల్లో కొంత భాగాన్ని ప్రభుత్వ ఆదాయంగా మళ్లించడం ఈ పన్ను ప్రధాన ఉద్దేశం.



# కోల్‌కతాలో ప్రేమకథ

మణిరత్నం దర్శకత్వంలో సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న తాజా ప్రేమకథా చిత్రంపై తమిళనాట ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. విజయ్‌సేతుపతి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ నెల 5 నుంచి కోల్‌కతాలో మొదలుకానుంది. దాదాపు 20రోజుల పాటు అక్కడే షూటింగ్ జరుగుతుందని, కేవలం 50 రోజుల్లోనే ఈ చిత్రాన్ని పూర్తి చేయాలని దర్శకుడు మణిరత్నం లక్ష్యంగా పెట్టుకున్నారని కోలీవుడ్ ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. సుదీర్ఘ విరామం తర్వాత మణిరత్నం దర్శకత్వంలో లవ్‌స్టోరీ రాబోతుండటం, అందులో నాయికగా సాయిపల్లవి నటిస్తుండటంతో ఈ సినిమాపై తమిళ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. భారీ మొత్తానికి డిజిటల్ హక్కులను కొనుగోలు చేశారని తెలిసింది. ఈ ఏడాదిలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.



# అంబ కథతో ఏఐ సినిమా

భారతీయ పురాణ ఇతిహాసం మహాభారతంలోని అంబ పాత్ర స్ఫూర్తితో 'అంబ'ఁ రివేంజ్' పేరుతో ఓ చిత్రం రాబోతున్నది. కృత్రిమ మేధ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. జయవర్ధన్ మడి దర్శకుడు. బుధవారం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'తెలుగులో తొలిసారి రూపొందిస్తున్న పూర్తి ఏఐ ఆధారిత చిత్రమిది. విజువల్ డిజైన్, క్యారెక్టర్ క్రియేషన్ వంటి అంశాల్లో ఆధునిక ఏఐ సాధనాలను ఉపయోగించబోతున్నాం. తెలుగు సినీరంగంలో ఈ సినిమా ప్రయోగాత్మక అధ్యాయానికి నాంది పలికింది' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్, ఏఐ విజువల్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్: కాలై విజువల్ స్టూడియోస్, దర్శకత్వం: జయవర్ధన్ మడి.



# ఫ్యామిలీ డ్రామాకు తోడు క్రైమ్ థ్రిల్లర్

## ఆదర్శకుటుంబం స్టోరీపై చర్చ

విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు క్రైమ్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని ఇటీవల చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో సుదీర్ఘంగా సాగే ఓ ట్రైన్ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించారట. సిట్యుయేషనల్ కామెడీతో నిండిన ఈ సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లను వినోదాత్మకంగా తెరకెక్కించడంలో త్రివిక్రమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌కు ఉన్న టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




# వారణాసి మేజర్ షూటింగ్ పూర్తి

## మరో 80 రోజుల టాకీ పార్ట్ మిలిందన్న జక్కన్న

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'వారణాసి' గురించి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆర్ఆర్ఆర్' రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రాజమౌళి ఈ వారణాసి సినిమా విషయాలపై స్పందించాడు. ఈ చిత్రానికి సంబంధించిన మేజర్ యాక్షన్ ఎపిసోడ్స్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, కేవలం 80 రోజుల టాకీ, చిన్నపాటి బ్యాలెన్స్ షూటింగ్ మాత్రమే మిగిలి ఉందని ఆయన స్పష్టం చేశారు. నిర్మాత పక్కనే ఉన్నందున ఎక్కువ విషయాలు చెప్పలేనని నవ్వుతూనే, ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ కల్లా పూర్తి షూటింగ్‌ను ముగించేలాప్లాన్ చేస్తున్నట్లు రాజమౌళి పేర్కొన్నారు. మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం, అనుకున్న సమయానికే అంటే ఏప్రిల్ 7, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమా కథాంశం గురించి వస్తున్న అప్‌డేట్స్ ప్రకారం, ఇది ఒక శివ భక్తుడి చుట్టూ తిరిగే అద్భుతమైన టైమ్-ట్రావెల్ అడ్వెంచర్ డ్రామా. విశ్వంలోనే అత్యంత శక్తివంతమైన ఒక అద్భుత వస్తువును కనుగొనడానికి శతాబ్దాల కాలంలో సాగే ప్రయాణమే ఈ చిత్రం. ఇందులో మహేష్ బాబు 'రుద్ర' అనే ప్రధాన పాత్రతో పాటు ఒక ప్రత్యేక ఎపిసోడ్‌లో 'శ్రీరాముడి'గా కూడా కనిపించనున్నారు. అలాగే ప్రియాంకా చోప్రా 'మందాకిని' పాత్రలో, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే నెగెటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా రెండు భాగాలుగా వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ, రాజమౌళి దీనిపై క్లారిటీ ఇస్తూ.. 'వారణాసి' రెండు భాగాలుగా కాకుండా సుమారు మూడు గంటల నిడివి గల ఒకే ఒక్క భారీ చిత్రంగా థియేటర్లలోకి రానుందని స్పష్టం చేశారు.

# టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల




రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# రావు బహదూర్‌కు మహేశ్ వాయిస్ ఓవర్

## చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన నిర్మాణ సంస్థ

టాలీవుడ్ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదుర్'. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పణలో జిఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా ట్రైలర్‌కు స్వయంగా మహేష్ బాబే వాయిస్ ఓవర్ అందించడం విశేషం. నాటకానికి లాజిక్ ఉండదు అంటారు.. కానీ నాటకానికి మాయ తోడైతే లాజిక్కే మారిపోతుంది అంటూ సాగే మహేష్ బాబు గంభీరమైన వాయిస్ ఓవర్ ట్రైలర్‌కు ప్రాణం పోసింది. ఒక వ్యక్తి చనిపోవాల్సిన సమయం కంటే ఏడాది పాటు ఎక్కువ కాలం ఎలా బతికాడు? ఒక చిన్న అనుమానం ఒక మనిషి జీవితాన్ని, అతని విధిని ఎలా మార్చేసింది.. అనే ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ట్రైలర్ సరికొత్తగా సాగింది. తెలుగు సినిమాలో ఇప్పటివరకు ఎవరూ చూడని ఒక మైండ్ బ్లోయింగ్ లాంటి ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం అందించబోతోందని మహేష్ బాబు తన వాయిస్ ఓవర్ ద్వారా హామీ ఇచ్చారు. చివరి స్టేజ్ లివర్ క్యాన్సర్‌తో మరణానికి దగ్గరై, మిరాకిల్‌గా బతికిన వ్యక్తిగా, 'రామప్ప' అలియాస్ 'రావు బహదుర్' పాత్రలో సత్యదేవ్ తన నట విశ్వరూపం చూపించారు. డార్క్ కామెడీ, సస్పెన్స్, మ్యాజికల్ రియలిజం కలబోసిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది. స్మరణ్ సాయి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కార్తీక్ పర్మార్ అద్భుతమైన విజువల్స్ సినిమా రేంజ్‌ను పెంచేశాయి. ఈ చిత్రాన్ని శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎఎస్ మూవీస్ బ్యానర్లపై చింత గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వికాస్ ముప్పాళ్ల,

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/